నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 6 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

కేసీఆర్ దీవెనలతో సేవలందిస్తున్నా..

- శ్రేణులకు అనునిత్యం అందుబాటులో ఉంటున్నా..
- పార్టీ బలోపేతానికి నిరంతర కృషి: ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం, జనవరి 5: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దీవెనలతో ప్రజలకు సేవలు అందిస్తున్నానని, పార్టీ శ్రేణులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. ఎమ్మెల్సీ పదవీకాలం మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనమండలి సభ్యుడిగా, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతం కోసం పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తనపై ఆదరాభిమానాలు చూపుతున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు తాతా మధుకు శుభాకాంక్షలు తెలిపారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఖమ్మం జిల్లా యువజన నాయకుడు బలుసు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ముదిగొండ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు భాషబోయిన వీరన్న, ఉన్నం బ్రహ్మయ్య, తాళ్లూరి జీవన్‌కుమార్, లీగల్ సెల్ బాధ్యులు, తెలంగాణ ఉద్యమ నాయకుడు బిచ్చాల తిరుమలరావు, తెలంగాణ ఉద్యమకారులు పగడాల నరేందర్, కోడిరెక్క ఉమాశంకర్, నెమలికొండ వంశీ, పార్టీ నాయకులు ముత్యాల వెంకటప్పారావు, బంక మల్లయ్య, శంకర్, భిక్షమయ్య, సద్దాం షేక్, చావా శ్రీనివాస్, మద్దెల విజయ్, యూత్ నాయకులు షారుక్, పోట్ల నితీష్, విద్యార్థి విభాగం మునాఫ్ పాల్గొన్నారు.

చెవిలో పూలతో జీసీసీ హమాలీల నిరసన

సమ్మె శిబిరంలో చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న జీసీసీ హమాలీ కార్మికులు

దమ్మపేట, జనవరి 5: చెవిలో పూలతో జీసీసీ హమాలీలు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) హమాలీలు భద్రాద్రి జిల్లా దమ్మపేటలో నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నాలుగో రోజు ఆదివారం చెవిలో పూలు పెట్టుకొని సమ్మె శిబిరంలో కూర్చొని వినూత్నంగా తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ వచ్చి హమాలీలకు సంఘీభావంగా మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించలేని స్థితిలో విమర్శించారు. గత అక్టోబర్‌లో కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి ఒక అంగీకారానికి వచ్చిందని అన్నారు. అంగీకరించిన ఎగుమతులు, దిగుమతుల ధరలపై జీవో ఇవ్వకుండా, వేతన బకాయిలు చెల్లించకుండా నాన్చివేత ధోరణి ప్రదర్శిస్తూ హమాలీల బతుకులతో ఆడుకుంటోందని మండిపడ్డారు. గత ఒప్పందాలకు భిన్నంగా సంవత్సర కాలం గడిచినా నేటికీ ప్రభుత్వం స్పందించకపోవడమంటే హమాలీ కార్మికులను ఆర్థికంగా నష్టపర్చడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే హామీలను నెరవేర్చి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు భోగి సత్యం, ప్రసాద్, వెంకట్, నరసయ్య, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

దగా..ధోకా..

అంతన్నాడింతన్నాడే రేవంతు..

- కపటత్వాన్ని కర్షకుల కళ్లకు కట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- 'రైతుభరోసా'గా రూ.15 వేలు ఇస్తామంటూ హామీలు
- అన్నదాతల ఓట్లు కొల్లగొట్టేందుకే తప్పుడు వాగ్దానాలు
- తీరా ఎన్నికల్లో గెలిచి గద్దెనెక్కాక వారికిచ్చిన మాటకు ఎగనామం
- ఢిల్లీ పెద్దల సాక్షిగా ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్‌కు మంగళం
- పంటల పెట్టుబడి రూ.12 వేలే అనడంపై అన్నదాతల ఆగ్రహం
- ఏడాది తర్వాత రేవంత్ సర్కారు స్వరూపం తెలిసిందంటూ గుర్రు
- ఇప్పటికే రెండు సీజన్ల పెట్టుబడి ఇవ్వకపోవడం పట్ల అసహనం

'అంతన్నాడింతన్నాడే గంగరాజు.. ముంతు మామిడి పండన్నాడే గంగరాజు..' అన్నట్లుగా ఉంది రేవంత్ సర్కారు తీరు. కాంగ్రెస్ ప్రభుత్వం తన కపటత్వాన్ని కర్షకుల కళ్లకు కట్టడంతో వారు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇచ్చిన రూ.10 వేల రైతుబంధును గుర్తుచేసుకుంటున్నారు. అదే సమయంలో రైతుభరోసా పేరిట రూ.15 వేలు ఇస్తామంటూ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ నమ్మబలికి ఏడాది తర్వాత తన నైజాన్ని బయటపెట్టుకోవడంపై గుర్రుగా ఉన్నారు. శనివారం నాటి క్యాబినెట్ మీటింగ్ అనంతరం 'రైతుభరోసా కింద ఎకరానికి రూ.12 వేలే ఇస్తాం' అంటూ సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డే ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సీజన్ల రైతుభరోసాకు ఎగనామం పెట్టారంటూ తీవ్ర అసహనంగా ఉన్నారు. 'కాంగ్రెస్ ఢిల్లీ పెద్దల సాక్షిగా ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్‌కు మంగళం పాడినట్లేనా?' అని ప్రశ్నిస్తున్నారు. 'మా ఓట్లు కొల్లగొట్టేందుకే తప్పుడు వాగ్దానాలు ఇచ్చారా?' అంటూ నిలదీస్తున్నారు.

-ఖమ్మం వ్యవసాయం, జనవరి 5



అన్నదాతల నమ్మకాన్ని కాంగ్రెస్ సర్కారు నిలువునా వమ్ముచేసింది. రైతుల పంటల పెట్టుబడికి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి కేవలం రూ.10 వేలు మాత్రమే ఇస్తోందని, తాము అధికారంలోకి వస్తే రైతుభరోసా పేరిట రూ.15 వేలు ఇస్తామని అన్నదాతలకు ఆశలు కల్పించింది. దీంతో అన్నదాతలు కూడా ఆ హామీలను నమ్మి ఏడాది క్రితం నాటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతుభరోసా ఇవ్వనేలేదు. తీరా శనివారం నాడు సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కర్షకులకు కన్నీళ్లు తెప్పించారు. నమ్మి మోసపోయామనుకునేలా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పెద్దలు, రాష్ట్ర పెద్దల సాక్షిగా ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్‌కు నిలువునా తూట్లు పొడిచారు.

కమిటీల పేరుతో కాలయాపన చేసి..

రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామన్న హామీని అమలు చేసేందుకు కమిటీల పేరుతో కాలయాపన చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఏడాదిపాటు సాగదీసి.. శనివారం నాడు స్పష్టతనిచ్చింది. ఎకరానికి రూ.15 వేల హామీని గట్టున పెట్టింది. కేవలం రూ.12 వేలే అంటూ తేల్చిచెప్పింది. అందులోనూ వ్యవసాయానికి యోగ్యమైన భూములకేనంటూ మెలికిపెట్టింది. దీంతో ఏడాది కాలంగా గంపెడాశలతో ఉన్న హలధారులు ఒక్కసారిగా నిట్టూర్చారు. అయితే, ఆ రూ.12 వేలను కూడా ఈ నెల 26 నుంచి అందిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి.. పెండింగ్‌లో ఉన్న రెండు సీజన్ల పంటల పెట్టుబడిని అదే రోజున జమ చేస్తారోలేదో స్పష్టతనివ్వలేదంటూ అన్నదాతలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే రుణమాఫీని కొందరికి మాత్రమే అమలుచేసిన ఉదంతాన్ని అనుభవించిన అన్నదాతలు ఇప్పటి రైతుభరోసాను కూడా ఎలా అమలు చేస్తారోనంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే ముగిసిన రెండు సీజన్లు..

కాంగ్రెస్ పభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. తరువాత 2024 యాసంగి, 2025 వానకాలం సీజన్లు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడు 2025 యాసంగి ప్రారంభమైంది. నాట్ల ప్రక్రియ కూడా పూర్తి కావస్తోంది. అయితే ఇటీవలి ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న రైతుభరోసా పంపిణీలో 'కేవలం తాజా సీజన్‌కు మాత్రమే జమ చేస్తారా? లేక గడిచిన రెండు సీజన్లతోపాటు తాజా సీజన్ పెట్టుబడిని కూడా కలిపి జమ చేస్తారా?' అంటూ అన్నదాతలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అదీగాక 'ఈ పెట్టుబడిని కౌలురైతులకు వర్తింపజేస్తారా? లేదా?' అనేది కూడా తేలాల్సి ఉంది.

గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతుబంధు పంపిణీ వివరాలు..

సంవత్సరం	పంట సీజన్	రైతుల సంఖ్య	జమ చేసిన సొమ్ము
2018-19	వానకాలం	2,85,348	రూ.260.12 కోట్లు
2018-19	యాసంగి	2,74,920	రూ.255.14 కోట్లు
2019-20	వానకాలం	2,82,323	రూ.272.02 కోట్లు
2019-20	యాసంగి	2,69,140	రూ.185.15 కోట్లు
2020-21	వానకాలం	3,04,520	రూ.362.69 కోట్లు
2020-21	యాసంగి	2,99,307	రూ.357.84 కోట్లు
2021-22	వానకాలం	3,09,847	రూ.362.06 కోట్లు
2021-22	యాసంగి	3,08,400	రూ.328.96 కోట్లు
2022-23	వానకాలం	3,15,772	రూ.356.27 కోట్లు
2022-23	యాసంగి	3,16,422	రూ.362 .84 కోట్లు
2023-24	వానకాలం	3,34,893	రూ.364.23 కోట్లు
2023-24	యాసంగి	3,34,719	రూ.364.14 కోట్లు
మొత్తం:		3,34,893	రూ.3,831.46 కోట్లు

నాడు కేసీఆర్ చెప్పింది రూ.8 వేలు.. ఇచ్చింది రూ.10 వేలు..

ఉమ్మడి పాలనలోని అన్నదాతలను అప్పుల ఊబి నుంచి బయటకు తెచ్చేందుకు, దండగన్న వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ పథకం దేశ చరిత్రలోనే అద్భుత పథకంగా ఖ్యాతి గడించింది. పంటలు సేద్యం చేసేందుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా అన్నదాతలకు ముందుగానే పంటల పెట్టుబడిని సాయాన్ని అందించే ఈ పథకాన్ని ప్రపంచ దేశాలు సైతం ప్రశంసించాయి. ప్రపంచంలో ఎక్కడా ఇదివరకెప్పుడూ ఇలాంటి పథకం లేదంటూ అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనను కీర్తించాయి. పథకాన్ని ప్రారంభించిన తొలినాళ్లలో అప్పటి మాట ప్రకారం ఎకరానికి రూ.8 వేలను రైతుబంధు పథకం పేరిట పంటల పెట్టుబడి సాయాన్ని అందించిన కేసీఆర్.. ఆ తరువాత ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచారు. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వ పదవీకాలం పూర్తయ్యే వరకూ నిరాటంకంగా అందించారు.

దీంతో ఒక్క ఖమ్మం జిల్లాలోనే ఏటా సుమారు 3 లక్షల మంది రైతులకు ఒక్కో సీజన్‌కు రూ.350 కోట్ల చొప్పున రూ.3,831.46 కోట్లను అందించారు. దీంతో విత్తనాలు, ఎరువులు ముందుగానే కొనుగోలు చేసుకున్న రైతులు.. ఎవరి దగ్గరా చేయి చాచకుండా వ్యవసాయాన్ని పండుగలా చేశారు. గణనీయమైన దిగుబడులు సాధించి తెలంగాణను అన్నపూర్ణగా నిలిపారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన రెండు, మూడు సీజన్లుగా అన్నదాతలను మళ్లీ అప్పులపాలు చేసింది.

'రైతుభరోసా'పై రేవంత్ సర్కారు మోసం

- కహానీల కాంగ్రెస్.. కర్షకులను నిలువునా దగా చేసింది
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జనవరి 5: కట్టు కథల కాంగ్రెస్ సర్కారు.. రైతుభరోసాపై మాట తప్పిందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. హామీలు అమలు చేయకుండా మొదటి నుంచీ ప్రజలను మోసం చేస్తూ వచ్చిందని, ఇప్పుడు రైతులను కూడా దగా చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు.. ఏడాది దాటినా వాటిని అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఇప్పుడు రైతుభరోసా విషయంలో కూడా మాట తప్పారని విమర్శించారు. రైతుభరోసా కింద అన్నదాతలకు పంటల పెట్టుబడి సాయంగా ఏటా ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ రైతుభరోసాను రూ.12 వేలకే పరిమితం చేయడమంటే రైతులను వంచించడమేనని తూర్పారబట్టారు. రైతులకు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రేవంత్‌రెడ్డి సర్కారు యావత్ రైతాంగాన్ని మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏడాదిపాటు కాలయాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రైతుభరోసాకు అనేక కొర్రీలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రైతుభరోసాకు కోతపెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. ప్రతీ రైతుకూ గుండెకోతను మిగిల్చిందని విమర్శించారు. ఇప్పటికైనా తుపాకీ రాముడి మాటలు బంద్ పెట్టాలని హితవుచెప్పారు. రైతుభరోసాపై మాటతప్పిన రేవంత్‌రెడ్డి సర్కార్.. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలు కోసం ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

గజగజ

- ఉమ్మడి ఖమ్మం జిల్లాను వణికిస్తున్న చలి
- గణనీయంగా పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు
- బయటికి రావాలంటేనే భయపడుతున్న జనం
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు
- రాత్రిళ్లు వణికిపోతున్న వృద్ధులు, చిన్నారులు

రామవరంలో చలిమంట కాచుకుంటున్న దృశ్యం

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం/ రామవరం, జనవరి 5: పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలి తీవ్రత అమాంతం పెరిగింది. ఉమ్మడి జిల్లా ప్రజలను గజగజా వణికిస్తోంది. దీంతో ఉదయాన్నే స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు రాత్రివేళల్లో వణికి పోతున్నారు. ఇక సాధారణ ప్రజలు కూడా తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రానున్న మూడు రోజులపాటు జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అదీగాక గడిచిన పది, పదిహేను రోజులుగా జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి పూట కూడా వాతావరణ చల్లగా ఉంటోంది. ఉదయం 8 గంటల వరకూ మంచు కురుస్తోంది. సాయంత్రం ఆరు దాటాక ఇళ్లలోని జనాలు బయటకు రావడం లేదు.

నిత్యం జనం సంచారంతో, వాహనాల రాకపోకలతో రద్దీగా కనిపించే రోడ్లు కూడా చీకటి పడగానే ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అయితే, వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పడిపోయిన ఉష్ణోగ్రతలు.

వాతావరణ మార్పుల కారణంగా మునుపెన్నడూ లేనంతగా ఈ సంవత్సరం పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ప్రధానంగా గడిచిన పక్షం రోజులుగా 12 నుంచి 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటీవల ఖమ్మం జిల్లా కామేపల్లిలో 19 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. 20 రోజుల క్రితం భద్రాద్రి జిల్లాలో 14 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. దీంతో అవకాశమున్న వాళ్లు చలిమంటలు వేసుకుంటున్నారు. చలిని తాళలేని వారికి దగ్గు, జలుబు కూడా వస్తున్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి..

చలి తీవ్రత పెరుగుతోంది. ఫలితంగా వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. చల్లగాలులు బాగా వీస్తున్నాయి. ఇలా ఎక్కువగా చలి ఉంటున్నప్పుడు పిల్లలను, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రతీ అరగంటకు వేడినీళ్లు తాగించాలి. చలికోట్లు ధరిస్తూ శరీరం వేడిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. తినే ఆహార పానీయాలు కూడా వేడిగా ఉండేలా చూసుకోవాలి. చల్లని పదార్థాలు తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లు వస్తాయి. ముఖ్యంగా బయటి ఆహారం తీసుకోవద్దు. జలుబుతో బాధపడుతున్న వారు ఆవిరి పట్టుకోవాలి. చలిగాలులు వీస్తున్న సమయంలో బయట తిరగవద్దు. **-డాక్టర్ పుష్పలత, ఎండీ జనరల్ మెడిసిన్**

గిరిజన మ్యూజియాన్ని.. సుందరంగా తీర్చిదిద్దాలి: పీవో

మ్యూజియాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం, జనవరి 5: గిరిజన మ్యూజియం అభివృద్ధి పనులను పూర్తిచేసి ముక్కోటి నాటికి దానిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని ఆదివారం సందర్శించిన ఆయన.. మ్యూజియంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ కళాఖండాలు సక్రమంగా అమర్చాలని సూచించారు. మ్యూజియం చుట్టూ వెదురుతో తయారుచేసిన దడిని మల్టీకలర్లతో అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. మ్యూజియం అంతటా విద్యుద్దీపాలు అలంకరించాలన్నారు. ఏసీఎంవో రమణయ్య, డీఈ హరీశ్, ఏపీవో పవర్ ఏఈ మునీర్ పాషా, జేడీఎం హరికృష్ణ, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి హంసవాహనంపై ట్రయల్ రన్

భద్రాచలంలోని ముక్కోటి ఏకాదశి వైకుంఠ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న జరిగే తెప్పోత్సవం కోసం భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి ఆధ్వర్యంలో అధికారులు గోదావరి నదిలో హంస వాహనానికి ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఆర్డీవో దామోదరరావు, ఆలయ ఈఈ రవీందర్, సీఐ సంజీవరావు, పంచాయతీ ఈవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన కేయూ క్రికెట్ టోర్నీ

విజేతగా వరంగల్.. రన్నరప్‌గా ఖమ్మం జట్టు

కేయూ క్రికెట్ టోర్నీ రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం జట్టు

ఖమ్మం సిటీ, జనవరి 5: ఖమ్మంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన కాకతీయ యూనివర్సిటీ పరిధి ఇంటర్ జోనల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌ను వరంగల్ జట్టు కైవసం చేసుకుంది. ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ఖమ్మం జట్టుతో జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జోన్.. నిర్ణీత 30 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. జట్టులోని డేవిన్ 43, అజహాన్ 29, అభిలాశ్ 12, సంతోశ్ 13 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 172 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విశాల్ యాదవ్ 68 పరుగులు చేసి జట్టు విజయంతో కీలకపాత్ర పోషించాడు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో డీవైఎస్‌వో తుంబూరు సునీల్‌రెడ్డి, కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణారావు.. విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన వరంగల్, ఖమ్మం జట్లకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులు చక్కటి ప్రతిభను కనబరిచారని అభినందించారు. ఆదివారంతో కేయూ వార్షిక క్రీడాపోటీలు ముగిశాయని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ జే ఉపేందర్, పీడీ రఘునందన్, సెలెక్టర్లు ఎం కుమార్, అప్జల్, గోపి, అస్లాం, ఎండీ మతిన్, ఆర్ ఉపేందర్, కమల్, సతీష్ పాల్గొన్నారు.